సాక్షి ప్రకాశం

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



తెలుగు పండిట్ రోస్టర్‌లో అక్రమాలు

2008 డీఎస్సీ తెలుగు పండింట్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో రోస్టర్ కం మెరిట్ లిస్టులో అక్రమాలపై విచారణ చేయాలని బీసీ సంఘ నాయకులు కలెక్టర్‌ను కోరారు.

- 8లో..



పొగాకు కొనకుండా మోసం

పొగాకు పంట మొత్తం కొంటామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం వెయ్యి మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసి చేతులు దులుపుకుందని రైతు సంఘ నాయకులు విమర్శించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

గణేష్ లడ్డు రూ.1.23 లక్షలు



వినాయక లడ్డుతో పాటదారులు

దర్శి: పట్టణంలోని గాంధీనగర్ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద నిమజ్జన ఊరేగింపు సందర్భంగా గణేష్ లడ్డు వేలం పాట పెట్టారు. వేలం పాటలో ముల్లంగి, దుగ్గిరెడ్డి బ్రదర్స్ కలసి రూ.1.23 లక్షలకు పాట పాడి ఈ లడ్డును దక్కించుకున్నారు.

నేడు వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

ఒంగోలు టౌన్: సంక్షేమ సారథి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు జిల్లా అంతటా నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మంగళవారం ఉదయం ఒంగోలు జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని బూచేపల్లి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులందరూ హాజరవుతారన్నారు. చీమకుర్తిలో మాజీ మంత్రి మేరుగు నాగార్జునతో కలిసి, దర్శిలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.
నగరంలోని అన్ని ప్రాంతాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు చేపడుతున్నామని పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ తెలిపారు. కార్యక్రమాల్లో ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు హాజరవుతారన్నారు.

గడపదాటని బేళ్లు.. దగా కొనుగోళ్లు!

పొగాకు బోర్డు, వ్యాపారుల మాయాజాలంలో చిక్కుకుని రైతులు విలవిల్లాడుతున్నారు. వేలం కేంద్రాల్లో ధరలు దారుణంగా పడిపోవడంతో పాటు వచ్చే బేళ్లలో 40 శాతం నోబిడ్ పేరుతో తిరస్కరణకు గురవుతుండడంతో గుండెలు పిండేసినట్టవుతోందని రైతులు వాపోతున్నారు. రూ.లక్షలు వెచ్చించి సాగు చేస్తే పెట్టుబడి ఎలా వస్తుందో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రోజురోజుకీ కనిష్ట ధరలు పతనమవుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించామని ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా ప్రకటనలు చేసినా కొనుగోళ్లలో ఎలాంటి మార్పురాలేదని ఆరోపిస్తున్నారు. రీజియన్ పరిధిలో 158 మిలియన్ కేజీలు ఉత్పత్తి కాగా ఇప్పటి వరకూ 94 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 64 మిలియన్ కేజీలు రైతుల వద్దే మగ్గుతోంది. పరిస్థితి ఇలా ఉంటే వచ్చే సీజన్‌కు పొగాకు సాగుచేయాలా? వద్దా? అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

- వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్లలో 40 శాతం తిరస్కరణ
- ఇప్పటి వరకూ 94 మిలియన్ కేజీలు కొనుగోలు
- రైతుల వద్దే 64 మిలియన్ కేజీలు
- రీజియన్ పరిధిలో ఐదు కేంద్రాల్లో వేలం పూర్తి
- రోజురోజుకూ పడిపోతున్న కనిష్ట ధరలు
- వచ్చే సీజన్‌లో సాగు ఎలా అంటున్న రైతులు



టంగుటూరు పొగాకు వేలం కేంద్రం నుంచి నోబిడ్ అయిన బేళ్లను వెనక్కు తీసుకెళ్తున్న రైతులు

చీమకుర్తి/టంగుటూరు/కొండపి:

పొగాకు కొనుగోళ్లు మొదలై ఆరు నెలలు గడిచినా నోబిడ్ పేరుతో పొగాకు బేళ్లను తిరస్కరిస్తున్న సంఖ్య నానాటికీ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. తేలికరకం నేలల్లో పొగాకు పండించే ప్లాట్‌ఫాంలలో సోమవారం జరిగిన వేలానికి 1873 బేళ్లు రాగా వాటిలో 41.27 శాతం అంటే 773 పొగాకు బేళ్లను నోబిడ్ పేరుతో తిరస్కరించారు. ప్రతి రోజు నోబిడ్ పేరుతో రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో వందలాది బేళ్లు తిరస్కరిస్తుండటంతో రైతులు పెట్టిన పెట్టుబడి ఎలా వస్తుందో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తిరస్కరించిన బేళ్లను మరొకసారి వేలానికి తీసుకురావడానికి ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

పడిపోతున్న ధరలు

2024–25 సీజన్‌కు సంబంధించి పొగాకు వేలం మార్చి పదో తేదీన ప్రారంభమైంది. ప్రారంభ రోజు పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.260 గా నమోదయింది. దీంతో రైతులందరూ ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ధరలు మరింతగా పెరుగుతాయని భావించారు. అయితే నానాటికీ ధరలు పతనమవుతూ వస్తున్నాయి. రైతులు ఆందోళన చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. రైతులను ఆదుకుంటున్నామని కూటమి ప్రభుత్వం పెద్ద ఆర్భాటంగా ప్రకటనలు చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. 11వ రౌండ్ ప్రారంభానికి వచ్చేసరికి కనిష్ట ధర రూ.130 కు పడిపోయింది. వేలం కేంద్రాలకు వచ్చిన పొగాకులో కొద్ది వాటికి మాత్రమే అధిక ధర చూపిస్తున్నారు. మిగతావన్నీ తక్కువ ధరకే చూపించి సరాసరి మాత్రం రూ.250 వరకూ చూపిస్తూ మాయచేస్తున్నారని రైతులు ధ్వజమెత్తుతున్నారు.

93.72 మిలియన్ కేజీలు కొనుగోలు..



టంగుటూరులో పొగాకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

రైతుల నుంచి 104.63 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేస్తామని బోర్డు (ఆథరైజ్డ్ క్వాంటిటీ) రైతులకు పొగాకు సాగుకు ముందు తెలియజేశారు. కాని రైతులు మాత్రం దానిని(ఎస్టిమేషన్ క్వాంటిటీ) 158 మిలియన్ కేజీలు వరకు పండించినట్లు బోర్డు లెక్కలు కట్టింది. ఆ లెక్కన 158 మిలియన్ కేజీలలో ఇప్పటి వరకు కేవలం 93.72 మిలియన్ కేజీలను మాత్రమే కొనుగోలు చేసింది. ఇంకా కొనుగోలు చేయాలసిన పొగాకు 64.2 మిలియన్ కేజీల పొగాకు రైతుల వద్దే మగ్గిపోతుంది. ఇదిలా ఉండగా నెల్లూరు జిల్లా పరిధిలోని కందుకూరు–1, 2, కలిగిరి, డీసీపల్లి, జిల్లా పరిధిలోని కనిగిరి ప్లాట్ ఫాంల్లో కొనుగోళ్లు ముగిసినట్టు అధికారులు చెబుతున్నారు. అదనపు పొగాకు కొనుగోలు చేయటానికి అనుమతి కోరుతూ ఢిల్లీకి సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి సమాచారం వస్తే గానీ మూసివేసిన 5 ప్లాట్‌ఫాంలలో రైతులు అదనంగా పండించిన పొగాకును కొనుగోలు చేయటానికి వీలు కాదని బోర్డు అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది నష్టాలే మిగులుతాయి



ఇప్పటి వరకు వేలం కేంద్రానికి పొగాకు బేళ్లు తీసుకొనిపోతే సగం పైగా తిరస్కరణ గురవుతున్నాయి. కేవలం హై గ్రేడు పొగాకునే కొనుగోలు చేస్తున్నారు. లోగ్రేడ్ పొగాకు వైపే కన్నెత్తి చూడటం లేదు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో అటు ప్రభుత్వాలు, ఇటు అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఇది ఇలా కొనసాగితే నష్టాలే.

– రాయింద్ల వెంకట నారాయణ, పొగాకు రైతు, పొందూరు గ్రామం, టంగుటూరు మండలం.

ఈ ఏడాది పెట్టుబడులు ఎక్కువయ్యాయి



గత ఏడాది కంటే పెట్టుబడి ఖర్చులు, కూలీల ఖర్చులు, మిగిలినవి ఎక్కువయ్యాయి. దానికి అనుగుణంగా పొగాకు రేట్లు లేవు. గత ఏడాది మేలిమి రకం రూ.360 కొనుగోలు చేస్తే ఇప్పుడు రూ.280 కొనుగోలు చేస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా రూ.300కు కొనుగోలు చేస్తున్నారు. కానీ లోగ్రేడు పొగాకు మాత్రం రూ.125కు దించారు. ఇప్పటికైనా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.

– సింగమనేని బ్రహ్మయ్య, పొగాకు రైతు, మర్లపాడు గ్రామం, టంగుటూరు మండలం.

బీసీ-ఈ కోటా వైఎస్సార్ చలవే

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన బీసీ–ఈ రిజర్వేషన్లు ముస్లింల పాలిట వరంగా మారాయి. బీసీఈ కోటాలో 4 శాతం రిజర్వేషన్ల సహాయంతో ఎంతో మంది ముస్లిం విద్యార్థులు ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ విద్యనభ్యసించడంతో పాటు ఉన్నత ఉద్యోగాలు పొందుతున్నారు. కంభం పట్టణంలో ఇప్పటి వరకు సుమారు 20 మంది ముస్లిం విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేయగా ఈ ఏడాది పట్టణానికి చెందిన షేక్ అమీర్‌బాష కుమార్తె ఈనెల 25న జరిగిన మొదటి దశ కౌన్సెలింగ్ లోనే శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.



కరువు నేలపై హరిత సంతకం

కరువు రక్కసి కాటేసిన నేలపై ఆయనో హరితపు సంతకం. బీడువారిన నేలతల్లికి జలసిరులందించిన భగీరథ రూపం. లయతప్పిన పేద గుండెకు ఊపిరిలూదిన దైవం. చదువు'కొనలేక' పేదింటి అక్షరం చిన్నబోతే..వయసుడిగిన నాడు ఆసరాలేక వృద్ధాప్యం ఉసూరుమంటే ఇంటికి పెద్దకొడుకై ఆదుకున్న ఆపన్న హస్తం. మహానేత దూరమై నేటికి 16 ఏళ్లు గడిచినా ఆయన అందించిన సంక్షేమ ఫలాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నాయి. వెలుగొండ, గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టులు.. రిమ్స్ వైఎస్సార్ చేసిన అభివృద్ధిని నిరంతరం గుర్తుచేస్తూనే ఉన్నాయి.

- జిల్లా అభివృద్ధిపై వైఎస్సార్ చెరగని ముద్ర
- సాగు, తాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం
- రిమ్స్, ఆరోగ్యశ్రీతో పేదల దరికి మెరుగైన వైద్యం
- నేడు వైఎస్సార్ వర్ధంతి



మార్కాపురం:

అప్పటి దాకా కరువు కాటకాలతో అల్లాడిన జిల్లా స్థితిగతులు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మారిపోయాయి. జిల్లాకు జలజీవాన్ని అందించే ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన ఆయన వాటిని కార్యరూపం దాల్చేలా చేశారు. జిల్లా అభివృద్ధిపై తనదైన ముద్రవేశారు. తన పాలనలో ఉచిత విద్యుత్, పావలా వడ్డీ రుణాలు, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంటు ఇలా చరిత్రలో గుర్తుండిపోయే పథకాలను ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ కోట్లాది కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఆయన దివికేగి 16 ఏళ్లు గడచినా ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు జిల్లా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ఒంగోలు రిమ్స్ తలమానికం

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ప్రజలకు వైద్య సదుపాయాలు లేక ఏ చిన్నపాటి రోగం వచ్చినా, సర్జరీ చేయాలన్నా అటు గుంటూరు, ఇటు కర్నూలు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో అప్పటి ముఖ్యమంత్రి ఒంగోలులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెడికల్ కళాశాల నిర్మాణం కోసం రూ.250 కోట్లు కేటాయించి రిమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ వైద్యశాలను ప్రస్తుతం జీజీహెచ్‌గా మార్చారు.




వెలుగొండ ప్రాజెక్టు పనులకు శ్రీకారం

2005 మేలో వైఎస్ రాజశేఖరరెడ్డి వెలుగొండ ప్రాజెక్టు పనులను, మార్కాపురం సమీపంలోని గొట్టిపడియ, సుంకేశుల డ్యామ్ పనులను ప్రారంభించారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మందికి తాగునీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. 18.8 కి.మీ పొడవుతో దోర్నాల మండలం కొత్తూరు వద్ద 2 టన్నెల్స్‌ను మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. మహానేత చివరిరోజు వరకూ వెలుగొండపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో అప్పట్లో పనులు వేగవంతం అయ్యాయి. ఆ తరువాత వచ్చిన చంద్రబాబునాయుడు ప్రాజెక్టుపై దృష్టి సారించకపోవడంతో పనులు మందకొడిగా సాగాయి.

☛ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రూ.400 కోట్లతో సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టడంతో జిల్లాలోని త్రిపురాంతకం, పుల్లలచెరువు, దర్శి, చీమకుర్తి, సంతనూతలపాడు, యర్రగొండపాలెం, పర్చూరు, అద్దంకి తదితర ప్రాంతాల్లోని 4.50 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు సస్యశ్యామలమైంది. కనిగిరి నియోజకవర్గంలో రూ.175 కోట్లతో రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరుచేసి ఫ్లోరైడ్ వాటర్ నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో రూ.12 కోట్లతో భైరేనిగుండాల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రూ.22 కోట్లతో రామన్నకతువ నిర్మించారు. 2004 మే నెలకు ముందు జిల్లాలో 63,559 మంది రైతుల కరెంటు బకాయిలను వైఎస్ఆర్ రద్దు చేశారు. అప్పటికే జిల్లా వ్యాప్తంగా 71,321 మంది రైతులకు ఉచిత విద్యుత్ అందించారు.

గుండ్లకమ్మతో సస్యశ్యామలం...

వృథాగా పోతున్న నీరు నిల్వచేసి ప్రాజెక్టు కడితే రైతులకు ఉపయోగపడుతుందని భావించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు కోసం అప్పట్లోనే రూ.543.43 కోట్లు కేటాయించి జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 9 మండలాల పరిధిలోని 84 వేల ఎకరాలకు సాగునీటితోపాటు ఒంగోలు, దాని చుట్టుపక్కల 43 గ్రామాల పరిధిలోని 2.56 లక్షల మంది ప్రజలకు తాగునీటిని కూడా అందించారు. 2008 నవంబరు 24న జాతికి అంకితం చేశారు. తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు చివరి భూములకు కూడా సాగునీరు అందించేందుకు రూ.100 కోట్లు మంజూరు చేయించి కాలువలను ఆధునికీకరించారు.



తండ్రి బాటలో తనయుడు

తండ్రి బాటలోనే పయనిస్తూ ఆయన **తనయుడు** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి**గా వివిధ** అభివృద్ధి పనులు చేసి జిల్లా ప్రజల గుండె**ల్లో చెరగని** ముద్ర వేసుకున్నారు. ఐదేళ్ల పాలనలో **తండ్రి ఆశ**యాలను కొనసాగిస్తూ వెలుగొండ ప్రాజె**క్టును 2024** మార్చి 6న జాతికి అంకితం చేసి దశాబ్దా**ల కలను** నెరవేర్చారు. ఆసియాలోనే అత్యంత **పొడవైన** సొరంగ మార్గాలను పూర్తిచేసి చరిత్ర **సృష్టించారు.** 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చా**రు. నాడు** తండ్రి ప్రారంభించిన పనులను తనయు**డు పూర్తి** చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

☛ ఒంగోలులో రిమ్స్ వైద్యశాల అభివృద్ధి కోసం అదనంగా రూ.170 కోట్లు మంజూరు చేశారు. అత్యాధునిక వైద్య సౌకర్యాల కోసం మరో రూ.100 కోట్లతో జీజీహెచ్‌లో అభివృద్ధి పనులు చేపట్టారు.


☛ పశ్చిమ ప్రకాశం ప్రజలకు వైద్యసేవలు అందని ద్రాక్షలాగా మారిన నేపథ్యంలో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేయడంతో పాటు నిధులు కేటాయించడంతో 70 శాతం పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచిపోయాయి.

☛ దోర్నాలలో సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను కూడా మంజూరు చేసి నిధులు కేటాయించారు.

☛ ఒక్క మార్కాపురం నియోజకవర్గంలోనే ఐదేళ్ల కాలంలో సుమారు రూ.1500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి.

☛ మార్కాపురం మండలంలోని గొట్టిపడియ వద్ద సుమారు రూ.1200 కోట్లతో ఇన్‌టెక్‌వెల్ ట్యాంకుకు నిధులు మంజూరుచేసి 70 శాతం పనులు పూర్తిచేశారు. వెలుగొండ నీటిని దీనికి కేటాయించి ఈ ట్యాంకు నుంచి మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం తదితర నియోజకవర్గాల్లోని సుమారు 500 గ్రామాలకు పైగా ప్రజలకు నీటిని అందించనున్నారు.

నా ప్రాణాలు నిలిచింది ఆరోగ్యశ్రీ వల్లే..



2007వ సంవత్సరంలో నేను క్యాన్సర్ బారిన పడ్డాను. నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఉండటంతో హైదరాబాద్ నిమ్స్ వైద్యశాలలో అప్పుడు ఉచితంగా చికిత్స అందించారు. ఒక్కో ఇంజక్షన్ ఖరీదు సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. అటువంటి ఇంజక్షన్లు ఉచితంగా వేసి కీమోథెరపీ చేయడంతో నేను క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్నాను. రూ.5 లక్షల వైద్యం నాడు ఉచితంగా అందించడం వల్లే నేను ఈ రోజు ప్రాణాలతో ఉన్నాను.

– షేక్ రసూల్, చిన్నకంభం, కంభం మండలం



వెలుగొండ ప్రాజెక్టు కుడి, ఎడమ టన్నెళ్లు

కూటమిది కక్షపూరిత పాలన



రుద్రవరంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మేరుగు నాగార్జున

- ప్రజలను మోసగించడం బాబుకి పరిపాటిగా మారింది
- అభివృద్ధి, సంక్షేమాన్ని మరచిన కూటమి ప్రభుత్వం
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్):

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా కక్షపూరితంగా సాగిందని, ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, మర్డర్లు, మహిళలపై అఘాయిత్యాలే తప్ప అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని సంతనూతలపాడు ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున అన్నారు. రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేరుగు నాగార్జున పాల్గొని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పోరాటాల వలనే ఒకటి రెండు పథకాలైనా తూతూమంత్రంగా అమలు చేశారన్నారు. ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చి అధికారంలోకి వచ్చిన తరువాత వెన్నుపోటు పొడవటం చంద్రబాబుకు అలవాటే అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రశ్నించిన వారిపై అరెస్టులు, అసత్య ప్రచారాలు, కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం సర్వసాధారణమైందని విమర్శించారు. అన్నదాతకు ఎరువుల కొరత, పండించిన పంటకు మద్దతు ధర లేదని ధ్వజమెత్తారు. కూటమి దౌర్జన్య పాలనకు చెక్ పెట్టాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ ను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ విజయనాగేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, దుంపా ఎలమందరెడ్డి, సర్పంచ్‌లు బలరామిరెడ్డి, విజయలక్ష్మి, ఎంపీటీసీలు వెంకట కృష్ణారెడ్డి, మాధవి, రుద్రవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ రెడ్డి, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గురవరెడ్డిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కే బ్రహ్మారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మేకల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు వైఎస్సార్

- వైఎస్సార్ వర్ధంతిని జయప్రదం చేయండి
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు టౌన్:

కులమతాలకతీతంగా, సమాజంలోని అన్నీ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి అందరివాడిగా విశేషాదరణ పొందిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని యావత్ తెలుగు జాతి ఎన్నటికీ మరచిపోదని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి అన్నారు. సువర్ణపాలనతో సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నిర్వహించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వృత్తిపరంగా వైద్యుడైన రాజన్న సమాజంలోని అన్నీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఉమ్మడి రాష్ట్రంలో చేసిన 1450 కిలో మీటర్ల పాదయాత్ర దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలబడిపోయిందని చెప్పారు. పాదయాత్రలో ప్రజలతో మమేకమైన ఆయన అధికారం చేపట్టిన తరువాత ప్రజారంజక పాలన అందించారని గుర్తు చేశారు. రైతు రుణాలను రద్దు చేస్తూ తొలిసంతకం చేసిన గొప్ప సంస్కరణవాదిగా నిలిచారన్నారు. సామాన్య నిరుపేదల కోసం ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేసి లక్షలాది మంది ప్రాణాలను కాపాడారని చెప్పారు. దారిద్య్ర రేఖకు దిగువ ఉన్న పిల్లలకు కార్పొరేట్ కళాశాలల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పిస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. జలయజ్ఞంతో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారన్నారు. 108 అత్యవసర వాహనాలను ప్రవేశపెట్టారని, మారుమూల ప్రజలందరికీ వైద్య సేవలు అందించేందుకు 104 మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారని తెలిపారు. ముస్లిం సోదరులకు 4 శాతం రిజర్వేషన్లను కల్పించి వారి సామాజిక ఎదుగుదలకు చేయూతనందించారని చెప్పారు. వారసుడిగా ఆయన ఆలోచనలను మరింత ముందుకు తీసుకెళుతున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అండగా నిలబడి అడుగులో అడుగేసి నడుద్దామని పిలుపునిచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

క్లుప్తంగా

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

● కాలువలో పడి వ్యక్తి మృతి


మృతిచెందిన వెంకటేశ్వర్లు (ఫైల్)

ముండ్లమూరు (దర్శి): వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న సమయంలో కాలువలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ముండ్లమూరు మండలంలోని పెద్ద ఉల్లగల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటల సమయంలో సోమవారం రెడ్డినగర్ వద్ద గల ఎన్ఎస్పీ కెనాల్ వద్దకు తరలించారు. నిమజ్జనం చేస్తుండగా పెద్ద ఉల్లగల్లు గ్రామానికి చెందిన వాలేటి వెంకటేశ్వర్లు కాలువలో జారిపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి


వేజెండ్ల గంగాధర్ (ఫైల్)

కొండపి: ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్ చేయబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతిచెందిన సంఘటన కొండపి మండలంలోని కొండపి – అనకర్లపూడి గ్రామాల మధ్య శాంతినికేతన్ హైస్కూల్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన వేజండ్ల గంగాధర్ (26) సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామంలో బంధువుల ఇంట్లో ఒక ఫంక్షన్‌కు భార్య మానసతో కలిసి హాజరయ్యాడు. గంగాధర్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోగా, భార్య స్వగ్రామమైన చీమకుర్తి మండలం భూసరపల్లిలో నూడిల్స్ బండి పెట్టుకుని జీవిస్తున్నాడు. సరుకుల నిమిత్తం ఫంక్షన్ నుంచి నేరుగా కొండపి వచ్చాడు. సరుకులు తీసుకుని మద్దులూరు గ్రామం వెళ్లి భార్యను తీసుకుని భూసరపల్లి వెళ్లే క్రమంలో కొండపి నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి క్రాస్ చేయబోయాడు. ఆ సమయంలో రోడ్డు మార్జిన్‌లోకి దిగగా, గుంతలు ఉండటంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బస్సుకు తగిలింది. దీంతో రోడ్డుపై పడిపోగా, బస్సు వెనుక టైరు తలకు బలంగా తగలడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పది నెలల క్రితమే భూసరపల్లి గ్రామానికి చెందిన మానసను గంగాధర్ వివాహం చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

తెలుగు పండిట్ రోస్టర్‌లో అక్రమాలు

- సాగర్ కాలువలో వ్యర్థాలు
- శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు
- మీ కోసం కార్యక్రమంలో వెల్లువెత్తిన ఫిర్యాదులు


మీ కోసం కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: 2008 డీఎస్సీ గ్రేడ్–2 తెలుగు పండిట్ పోస్టుల ఎంపిక ప్రక్రియ రోస్టర్ కం మెరిట్ లిస్టులో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ జరిపించాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. మొత్తం 250 పోస్టుల కోసం నోటిఫికేషన్ ఇచ్చారని, మూడు జాబితాలుగా పోస్టులు భర్తీ చేశారని, అయితే ఈ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయని వివరించారు. మీ కోసం కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు క్యూ కట్టారు. కలెక్టర్ వచ్చి వెంటనే వెళ్లిపోగా, జేసీ గోపాలకృష్ణ అర్జీలు స్వీకరించారు.

సాగర్ కాలువలో చేపలు, చికెన్ వ్యర్థాలు...


చీమకుర్తి ఎస్ఎస్పీ కాలనీ సమీపంలో సాగర్ కాలువలో కలుస్తున్న వ్యర్థాలు

చీమకుర్తి సమీపంలోని నాగార్జునసాగర్ కాలువలో చేపల, చికెన్ వ్యర్థాలు కలుస్తున్నాయని చీమకుర్తికి చెందిన గుండాల శ్రీనివాసరావు మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. వ్యర్థాలు కలపడం వలన అంతుచిక్కని వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దిగువ ప్రాంత ప్రజలైన సంతనూతలపాడు, ఒంగోలు నగర ప్రజలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చీమకుర్తి గ్రామంలోని పడమర బైపాస్ వద్ద సాగర్ కాలువకు ఇరువైపులా అనుమతి లేని చేపల మార్కెట్ ఉంది. ఇక్కడ చేపలు కొన్న వారికి అక్కడే కోసి శుభ్రం చేసి అమ్ముతారు. ఆ వ్యర్థాలు నాగార్జున సాగర్ కాలువలో కలవడం వలన జలాలు కలుషితం అవుతున్నాయి. ఈ సాగర్ జలాలే చీమకుర్తి నుంచి సంతనూతలపాడు చెరువుకు, ఒంగోలు నగరంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు, దిగువ ప్రాంత గ్రామాల చెరువులకు తాగునీటికి సరఫరా అవుతున్నాయి. ఈ నీటిని సుమారు ఆరు లక్షల మందికిపైగా తాగుటానికి వాడుతుంటారు. అసలే గ్రానైట్ క్వారీలలోని ప్రాణాంతక వ్యర్థ జలాలు కలుస్తున్నాయి. దానికి తోడుగా మధ్యలో చికెన్, చేపల వ్యర్థాలు కాలువలో కలపడం వలన ఈ నీళ్లు తాగిన వాళ్లకు అనేక రకాల వ్యాధులు, విషపూరిత జ్వరాలు, కిడ్నీ, క్యాన్సర్ వ్యాధులు, చర్మ సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నాయి. పొలాలకు వెళ్లి పని చేసే రైతులు కాళ్ల దద్దుర్లు, ఇతర చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. పశువులు కూడా అనారోగ్యంతో చనిపోతున్నాయని శ్రీనివాసరావు వివరించారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు...

కొత్తపట్నం మండలంలోని కొన్ని ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని పారా లీగల్ వలంటీర్ చింతల ఆంజనేయులు మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. కొత్తపట్నం తహసీల్దార్, ఎంపీడీఓ, అంగన్‌వాడీ సెంటర్లు కొన్నింటి గోడల్లో చెట్లు మొలిచాయి. ఆ చెట్లు పెద్దగా మారడంతో గోడలు పగుళ్లిచ్చి కూలిపోయే స్థితికి చేరుతున్నాయి. మండల ప్రజలకు, రైతులకూ సేవలందించే కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. ఇతర ప్రభుత్వ భవనాలు కూడా కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. మండలంలోని కొన్ని అంగన్‌వాడీ భవనాలు కూడా కూలిపోయే స్థితిలో ఉన్నాయి. అవి ఎప్పుడైనా పిల్లలు ఉన్నప్పుడు కూలి వారిపై పడవచ్చని, అలా జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని ఆంజనేయులు కోరారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ–1లో 1,2 తరగతులు, కేటగిరీ–2లో 3,4 తరగతులు, కేటగిరీ–3లో 5,6,7 తరగతులు, కేటగిరీ–4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

‘పొగాకు’ గోల్‌మాల్‌పై విచారణ

- టంగుటూరులోని ఓ కంపెనీలో రూ.20 కోట్లు పక్కదారి
- రూ.8 కోట్లు రికవరీ చేసినట్లు సమాచారం

ఒంగోలు టౌన్: టీడీపీ టంగుటూరులోని ఓ పొగాకు కంపెనీలో భారీ మొత్తంలో నగదు మాయం కావడంపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. టంగుటూరులోని కొండపి రోడ్డులో అన్నదమ్ములు 20 ఏళ్లుగా పొగాకు వ్యాపారం చేస్తున్నారు. వీరు రాజకీయ పలుకుబడి ఉపయోగించి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమంగా పొగాకు వ్యాపారం ద్వారా ఏడాదికి రూ. 300 కోట్లలకుపైగా టర్నోవర్ చేస్తున్నట్లు సమాచారం. కంపెనీ లెక్కలు చూడటానికి ఒక అకౌంటెంట్‌ను నియమించుకున్నారు. సదరు అకౌంటెంట్ వీరి వ్యాపారాలకు బినామీగా ఉన్నాడని, అతని అకౌంట్‌లో పెద్ద ఎత్తున నగదు జమచేసినట్లు తెలుస్తోంది. కొంతకాలంగా సోదరులు ఇతర పనుల్లో బిజీగా ఉండడం గమనించిన సదరు అకౌంటెంట్ చేతివాటం చూపినట్లు తెలిసింది. దాదాపు రూ. 20 కోట్లకుపైగా నగదును తన సొంత అకౌంట్‌లోకి మళ్లించినట్లు తెలిసింది. 108లో డ్రైవర్‌గా పనిచేసే తన మిత్రుడి అకౌంట్‌లో రూ.18 లక్షలు, మిత్రుని భార్య అకౌంట్‌లో రూ.5 కోట్ల నగదు జమ చేసినట్లు తెలిసింది. అకౌంటెంట్ చేతివాటాన్ని ఆలస్యంగా గుర్తించి వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రత్యేక టీంను రంగంలోకి దించి అకౌంటెంట్ సురేంద్రతో పాటు 108 డ్రైవర్, అతడి భార్యను కూడా అదుపులోకి తీసుకుని ఒక రహస్య ప్రదేశంలో ఉంచి విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రూ.8 కోట్ల నగదు, 1.9 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సదరు అకౌంటెంట్‌తో పాటు నిబంధనలకు విరుద్ధంగా పొగాకు కొనుగోలు చేస్తున్న వారిపై విచారణ చేపడితే అక్రమాల గుట్టు రట్టవుతుందని చర్చ నడుస్తోంది.

కటకటాల్లోకి కిలేడీ

- బ్యాగుల్లో బంగారం మాయం చేయడంలో సిద్ధహస్తురాలు
- వివరాలు వెల్లడించిన ఒంగోలు వన్‌టౌన్, సీసీఎస్ సీఐలు


నిందితురాలి వివరాలు వెల్లడిస్తున్న సీఐలు నాగరాజు, జగదీష్

ఒంగోలు టౌన్: బస్సుల్లో ప్రయాణికుల బ్యాగుల నుంచి బంగారు నగలు కాజేసే కిలేడీ దొంగ ఆటకట్టించారు ఒంగోలు పోలీసులు. స్థానిక సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ నాగరాజు, సీసీఎస్ సీఐ జగదీష్ చోరీ కేసు వివరాలు వెల్లడించారు. సింగరాయకొండ గ్రామానికి చెందిన నరసమ్మ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తిని వివాహం చేసుకుని దొంగతనాలనే వృత్తిగా మార్చుకుంది. పెళ్లయిన కొద్ది రోజులకు భర్త మృతి చెందడంతో స్వగ్రామమైన సింగరాయకొండకు చేరుకుంది. అమావాస్య విజయ్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. తేనె విక్రయిస్తున్నట్లు నటిస్తూ చోరీలకు పాల్పడేది.

8 నెలలకు దొరికింది

ఈ ఏడాది జనవరి 16వ తేదీన ఇండ్ల నాగలక్ష్మి ఒంగోలు నుంచి నెల్లూరుకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఆమె వెంట తెచ్చుకున్న బ్యాగును పక్క సీటులో పెట్టారు. సింగరాయకొండకు చేరుకున్న తర్వాత బ్యాగును పరిశీలించుకోగా బంగారు నగలు కనిపించలేదు. బస్సులో తన పక్కన కూర్చుని దిగిపోయిన మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో నాగలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ వన్‌టౌన్ సీఐ నాగరాజు, సీసీఎస్ సీఐ జగదీష్ ఆధ్వర్యంలో రెండు బృందాలతో దర్యాప్తు చేయించారు. నరసమ్మను నిందితురాలిగా గుర్తించిన పోలీసులు ఆగస్టు 31వ తేదీన ఒంగోలు భాగ్యనగర్ 4వ లైను వద్ద ఉండగా అరెస్టు చేశారు. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.



వైఎస్సార్ సీపీ సానుభూతిపరునిపై టీడీపీ వర్గీయుల దాడి


నరసింహారావు తల పగలడంతో చికిత్స చేస్తున్న వైద్యులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహారావు

దర్శి: మండలంలోని లంకోజనపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడనే కారణంతో అతని ఇంటి మీదకు పది మంది టీడీపీ వర్గీయులు వెళ్లి దాడి చేసి గాయపరిచారు. తమకు గిట్టని వారితో తిరిగాడనే కారణంతో ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎనిగిరి పర్వతాలు, శంకర్, నారాయణ, మరో పది మంది కలిసి వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు కొరివి నరసింహారావుపై గత శనివారం రాత్రి దాడిచేశారు. నరసింహారావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో ఏ పార్టీకీ సంబంధం లేకుండా ఏర్పాటు చేసిన వినాయకుని బొమ్మ వద్ద అందరూ కలిసిమెలిసి సరదాగా మాట్లాడుకున్నారు. శనివారం రాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో వినాయకుడి విగ్రహం ఊరేగింపు ప్రారంభమైన తర్వాత నరసింహారావు ఇంటికొచ్చి అన్నం పెట్టుకుని తింటున్నాడు. ఆ సమయంలో టీడీపీ వర్గీయులు ఫోన్ చేసి విగ్రహం వద్ద నీతో మాట్లాడిన వాళ్లు ఎక్కడున్నారు..? నువ్వెక్కడున్నావు..? అని ప్రశ్నించారు. వాళ్లు ఎక్కడున్నారో నాకు తెలియదు..నేను ఇంటికి వచ్చానని అతను చెప్పాడు. వెంటనే పది మంది కర్రలతో నరసింహారావు ఇంటికొచ్చి అన్నం తింటున్న వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. తల, భుజానికి తీవ్ర గాయాలవడంతో స్థానిక వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కి నరసింహారావును తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నప్పటికీ.. దాడిచేసిన వారు గ్రామంలోనే యథేచ్ఛగా తిరుగుతుండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పొగాకు కొనకుండా మోసం

- రైతులను నిండాముంచిన కూటమి ప్రభుత్వం
- రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు ధ్వజం


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పొగాకు రైతులు

ఒంగోలు టౌన్: రైతులు సాగుచేసిన పొగాకు పంట మొత్తం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. కేవలం వేయి మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసి చేతులు దులుపుకుని మోసం చేసిందని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జజ్జూరి జయంతిబాబు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద పొగాకు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిబాబు మాట్లాడుతూ జిల్లాలో 6 వేల మెట్రిక్ టన్నుల పొగాకు నిల్వలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారని తెలిపారు. కొనుగోలు ప్రారంభించి 2 నెలలు గడుస్తున్నా రైతులకు ఒక్క రూపాయి కూడా జమచేయలేదన్నారు. ప్రభుత్వం నూటికి 17 శాతం మాత్రమే కొనుగోలు చేసిందని, ఇంకా 87 శాతం రైతుల వద్ద పొగాకు నిల్వలు ఉండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున పొగాకు పాడైపోతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు కొనాలని డిమాండ్ చేశారు. ధర్నాకు రైతు సంఘ నాగులప్పలపాడు మండల అధ్యక్షుడు తూబాటి శ్రీకాంత్ అధ్యక్షత వహించగా కనపర్తి సుబ్బారావు, చెరుకూరి వాసు, నల్లూరి ప్రసాద్, పోకిరి నాగరాజు, మేకల ప్రసాద్, పావులూరి రామారావు, గద్దం ఏలియా, పాలపర్తి యోన, దాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు.

పింఛను సొమ్ము ఎగ్గొట్టారు


ఓబుల్‌రెడ్డిపల్లెలో పింఛన్ సొమ్ము ఇవ్వలేదని నిరసన వ్యక్తం చేస్తున్న వృద్ధులు, వికలాంగులు


సర్టిఫికెట్ చూపుతున్న రాయపాటి రామకృష్ణరెడ్డి

- రాచర్ల మండలం ఓబుల్‌రెడ్డిపల్లెలో 21 మంది నిరసన

రాచర్ల: మండలంలోని పాలకవీడు పంచాయతీ పరిధిలోని ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామంలో పింఛను నగదు ఇవ్వలేదని సోమవారం ఏడుగురు వృద్ధులు, 14 మంది దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. తమకు పింఛను సొమ్ము ప్రభుత్వం మంజూరు చేసినా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అనుమలవీడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీను గ్రామానికి వచ్చి తమకు పింఛను సొమ్ము ఇవ్వకుండానే వెళ్లిపోయారని ఆరోపించారు. ఈ విషయమై వెల్ఫేర్ అసిస్టెంట్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. పంచాయతీ కార్యదర్శి గణేష్‌ను వివరణ కోరగా.. ఆ విషయం తనకు తెలియదని సమాధానమిచ్చారు. ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి వివరణ కోరగా.. ‘ఈ విషయం నాకు తెలియదు, ఇలా ఎందుకు జరిగిందో విచారిస్తాన’ని చెప్పారు.

> **నాకు పింఛన్ డబ్బులు ఇవ్వలేదు..**
> నాకు 2004 నుంచి రూ.200 రూపాయల పింఛన్ వస్తోంది. గత ప్రభుత్వంలో 65 శాతం మానసిక వికలాంగుడినని డాక్టర్ సర్టిఫికెట్ ఇవ్వడంతో రూ.3 వేలు పింఛను తీసుకున్నా. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.6 వేలు ఇచ్చారు. జూలైలో నాకు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు 65 శాతం మానసిక వికలాంగుడినని మరోమారు ధ్రువీకరించారు. సోమవారం పింఛను సొమ్ము ఇవ్వకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను అడిగితే డబ్బులు లేవంటూ వెళ్లిపోయారు.
> – రాయపాటి రామకృష్ణరెడ్డి, మానసిక దివ్యాంగుడు, ఓబుల్‌రెడ్డిపల్లె

భార్య హత్య కేసులో భర్త అరెస్టు


కేసు వివరాలు తెలుపుతున్న సీఐ, ఎస్సై

బేస్తవారిపేట: భార్యపై అనుమానం పెంచుకుని పథకం ప్రకారం హత్యకు పాల్పడిన భర్తను అరెస్టు చేసినట్లు సీఐ మల్లికార్జున తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వవరాలను సీఐ వెల్లడించారు. ఆగస్టు 22వ తేదీన పీవీ పురానికి చెందిన పగ్గాల వెంకటేశ్వర్లు పొలం వద్ద చిల్ల చెట్లు తొలగించాలని చెప్పి గొడ్డలి తీసుకుని బైక్‌పై భార్య రామలక్ష్మమ్మను ఎక్కించుకుని వెళ్లాడు. అక్కడ మొక్కజొన్న పొలం పక్కన సాగు చేసిన వరినారు వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న భార్యను గొడ్డలితో నరికాడు. బోర్లా కిందపడిపోయిన రామలక్ష్మమ్మను పక్కకు తిప్పి గొంతుపై మూడు సార్లు నరికాడు. దీంతో తల, గొంతు, మెడపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సోమవారం మధ్యాహ్నం బేస్తవారిపేట బస్టాండ్ సమీపంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిందితుడు వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేత నుంచి ట్రాక్టర్ స్వాధీనం


సచివాలయం ఆవరణలో ఉన్న ట్రాక్టర్

అర్ధవీడు: ఇళ్లలో చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకుగాను పాపినేనిపల్లి పంచాయతీకి ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్‌ను టీడీపీ నేత సొంతానికి వాడుకుంటున్న విషయంపై ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ ఉప సర్పంచ్ భర్త, టీడీపీ నాయకుడి ఇంటి వద్ద ఉన్న ట్రాక్టరును సోమవారం స్వాధీనం చేసుకుని గ్రామ సచివాలయం ఆవరణలో ఉంచారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

కనిగిరిరూరల్: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన కనిగిరి సమీపంలోని మాచవరం ఎస్సీ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కుడుముల మరియమ్మ(34), యోహాన్ భార్యాభర్తలు. మరియమ్మ అమ్మగారి ఊరైన ఎర్రోబనపల్లిలో వివాహానికి వెళ్లి సోమవారం ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు.